క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఉన్నతి ఆధ్వర్యంలో స్థానిక వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న యునెక్స్ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఆంగ్ల భాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, ఇంటర్వ్యూలు, డిబేట్, పబ్లిక్ స్పీకింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జనరల్ సైకాలజీ వంటి అంశాల్లో శిక్షణ అందించారు. ట్రైనర్ కె.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్. మురళి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమన్నారు. స్కిల్స్ నేర్చుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ అండ్ వాల్యూస్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఈ.రత్నపాప, నాన్ టెక్నికల్ ఆఫీసర్ జి.నాగవెంకటసాయి ప్రసాద్, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ యం.హారిక, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా తమ్ములూరి వెంకయ్య

మార్టూరు: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మార్టూరుకు చెందిన తమ్ములూరి వెంకయ్య నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ ఈ మేరకు తమ్ములూరి వెంకయ్యకు నియామక పత్రం అందజేశారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి

పర్చూరు (చినగంజాం): మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి. వెంకటస్వామి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశం భవనంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలసత్వం వహించే సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు



ఎరువులను పరిశీలిస్తున్న సీఐ వైవీ రమణయ్య

ఇంకొల్లు(చినగంజాం): ఎరువుల దుకాణదారులు రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య అన్నారు. గురువారం ఆయన ఇంకొల్లులోని రెండు ఎరువుల దుకాణాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఎరువలు దుకాణాల్లో యూరియా స్టాకు, గోడౌన్‌లలోని నిల్వలు పరిశీలించారు. గ్రామంలోని రమణ, సాగర్‌లకు సంబంధించిన దుకాణాలను

దళారీ వ్యవస్థకు చెక్

చీరాల టౌన్: రెవెన్యూ అర్జీలను త్వరగా పరిష్కరించాలని.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రోజులు తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా ఒక్క రోజులోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ కుర్రా గోపీ కృష్ణ అన్నారు. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టామని తెలిపారు.

వానొచ్చే.. ప్రమాదం తెచ్చే!

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు

వేటపాలెం: వర్షాకాలం ఆరంభం అవడంతో అటు రైతులు సంతోషంగా ఉండటం సహజం. అదే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తత అవసరం. జిల్లాలో ఎన్నో ఘటనల్లో పలువురు వ్యక్తులతో పాటు మూగ జీవాలు విద్యుత్ ఘాతాని గురై మృతి చెందుతున్నాయి. అలాగే అగ్ని ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వారం రోజుల క్రితం వేటపాలెం దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలో కురిసిన వర్షానికి కాలనీ ఇళ్లపై నుంచి వెళుతున్న హైటెక్షన్ విద్యుత్ వైరు తెగి కింద పడింది. అది కిందనే ఉన్న గృహవినియోగానికి వినియోగించే విద్యుత్ వైర్లపై పడటంతో ఒక్కసారిగా అధిక విద్యుత్ ప్రసరించి ఇళ్లలో ఉన్న గృహోపకరణాలు కాలిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రమాదాలు ఇలా..

వర్షాకాలంలో తుఫాన్‌లు, ఈదురు గాలులు వీస్తుంటాయి. వీటి వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి ఎందుకంటే వర్షాకాలంలోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవిలో విద్యుత్ వైర్లు తెగుతుంటాయి. బాగా కిందకు వేల్లాడుతుంటాయి. ఇళ్ల వద్ద దుస్తులు ఆరేసు కోవడానికి ఉపయోగించే ఇనుపతీగలు.. సరీస్ను వైర్లకు ఆనుకుంటే ముప్పు తప్పదు. అందుకే వైర్లకు రక్షణగా వేసే ప్లాస్టిక్ పైపులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. ఆరుబయట ఉన్న స్విచ్‌లు వేయడం వల్ల విద్యుదాఘాతాలనికి గురయ్యే ఆస్కారముంది. విద్యుత్ లైన్లు గమనించకుండా కొమ్మలు నరకడానికి చెట్లు ఎక్కకూడదు.

అవగాహన లేకుండా ఫ్యూజ్ వేయవద్దు..

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్‌లు పోతే లైన్‌మెన్ గానీ, అసిస్టెంట్ లైన్‌మన్ గానీ వచ్చే వరకు వేచి చూడాలి. కానీ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ను పిలవడమో, తామే ఫ్యూజ్ వేయడమో చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంటి వద్ద ఉండే విద్యుత్ మీటర్ల వద్ద గానీ, వ్యవసాయ భూముల్లోని స్టార్టర్‌గానీ, వ్యవసాయ భూముల్లోని బాక్సులు వద్ద గానీ.. ఎర్త్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో చూసు కోవాలి. విద్యుత్ తీగలు తెగి బాక్సు పైన పడపినా, వర్షం వల్ల బాక్సులు, వైర్లు తడిచినా ఎర్త్ వైరు కాపాడుతుంది.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేస్తున్న లైన్‌మేన్



కాలిపోయిన విద్యుత్ మీటరు

35 అడుగుల దూరంలో ఉండాలి..

వర్షాకాలంలో వచ్చే ఈదురుగాలులకు ఊరి బయట పొలాల్లో ఉండే విద్యుత్ తీగలు తెగిపడతాయి. వాటిని పునరుద్ధరించకపోతే వాటి వల్ల ప్రమాదాలకు ఆస్కారముంటుంది. పొలాల్లో స్టార్టర్ వద్ద నుంచి బోరు వరకుండే వైర్లను నేలపై ఉంచుతారు. దీనివల్ల వైర్లు నేల రాపిడికి గురై పైన ఉండే ఇన్సులేషన్ పోతోంది. వర్షం వచ్చే సమయంలో ఇనుప విద్యుత్ స్తంభాలను అసలు పట్టుకోకూడదు. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు వర్షాకాలంలో కనీసం 35 అడుగుల దూరంలో ఉండాలి.

ప్లాస్టిక్ బాక్స్‌లు ఉపయోగించాలి..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించి గతంలో రైతులు స్టార్టర్ బాక్సుకు ఇనుప బాక్సులు ఉపయోగించేవారు. విద్యుత్ తీగలు తెగి అవి ఇనుప బాక్సుకు ఆనుకుంటాయి. దీంతో బాక్సును అంటుకొగానే రైతులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు అందుబాటులోకి వస్తున్న ప్లాస్టిక్ బాక్సులను వాటి స్థానంలో ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా ప్రమాదాలకు అవకాశం ఉండదు.

> **వర్షాకాలం జాగ్రత్తగా ఉండాలి..**
> వర్షాకాలంలో రైతులు, విద్యుద్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. మరిన్ని జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు. అన్నింటి కంటే ప్రాణాలు విలువైనందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. ఎర్త్‌లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యుత్ ఉపకరణాలను తాకేటప్పుడు తప్పనిసరిగా రబ్బరు గ్లౌజులు వాడాలి.
> – భాస్కరరావు, విద్యుత్‌శాఖ ఏఈ, వేటపాలెం

తెలుగు వారి సంపద గిడుగు



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అద్దంకి రూరల్: మాతృ భాష అయిన తెలుగు రాయటం చదవటం నేర్చుకుంటే అన్ని సబ్జెక్టుల్లో రాణిస్తారని మైలవరం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు రమేష్ అన్నారు. గురువారం మండలంలోని మైలవరం జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పఠన పోటీలు, పద్యాల పోటీ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటవాహిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని పాల్గొని మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఈనెల 13న కోర్టు భవన సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. లోక్ అదాలత్‌ల వలన కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. ఏజీపీ బి. రమేష్ బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు.

ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

ఉప్పుటూరు(చినగంజాం): మహిళలు విద్యనభ్యసించి అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీఓ సుభద్ర అన్నారు. ఉప్పుటూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుభద్ర, సూపర్ వైజర్ సునంద, ఉప్పుటూరు హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్‌లు పాల్గొని మాట్లాడారు. స్త్రీభూణ హత్యలు తగ్గాలని, స్త్రీల కోసం అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని స్త్రీలు అవకాశాలన్నింటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన కారు

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన కారు రోడ్డు మార్జిన్‌లో ఉంచిన సిమెంట్ దిమ్మెను ఢీ కొన్న సంఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయరహదారి పోలీసుస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారిజామున జరిగింది. చెన్నై నుంచి వైజాగ్ వెళుతున్న ఇన్నోవా కారు మేదరమెట్ల జాతీయరహదారి పోలీసుస్టేషన్ సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ప్రమాదంలో డ్రైవర్ కృష్ణమూర్తి, డాల్ఫిన్ రాబర్ట్‌లకు రక్తగాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కలహాల నేపథ్యంలో సుత్తితో దాడి

చీరాల అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో టీడీపీ మాజీ పట్టణాధ్యక్షుడు గుంటూరు మాధవరావుపై సుత్తితో దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రుడు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు మాధవరావు గురువారం సాయంత్రం అద్దంకి నుంచి చీరాల వస్తుండగా చందలూరు సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో అతని వియ్యంకుడు కూర్మాల శ్రీనివాసరావు పెద్ద కుమారుడు ధీరజ్, మరికొందరు అడ్డగించి సుత్తితో కొట్టారన్నారు. ఇరుకుటుంబాలకు కుటుంబ కలహాలున్నట్లు తెలిసింది. ఈ కేసులో పూర్తి వివరాలు విచారణ లో తేలాల్సి ఉంది.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాదుల పట్ల పోలీసులు ప్రదర్శిస్తున్న తీరుకు నిరసనగా చీరాల న్యాయవాదులు గురువారం తమ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు మాట్లాడారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల పట్ల పోలీసులు తీరు దుర్మార్గంగా ఉందన్నారు. పది రోజులు క్రితం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదుల పట్ల బాపట్ల ఒన్‌టౌన్ సీఐ దురుసుగా ప్రవర్తించిన సంఘటన మరువకముందే నందిగామ పోలీసులు ఇద్దరు న్యాయవాదులపై కేసులు నమోదు చేయడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. అదేవిధంగా వారం రోజులు క్రితం బాధితుల పక్షాన పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించి అతనిని చుట్టుముట్టి రౌడీని తీసుకెళ్లినట్లు బలవంతంగా జీపులో ఎక్కించుకుని వెళ్లడం విచారకరమన్నారు.

సమయపాలన ముఖ్యం

బల్లికురవ: సచివాలయల్లో పని చేస్తున్న వివిధ శాఖలు విధులు, బాధ్యతలు గుర్తెరిగి అంకిత భావంతో పని చేయాలని ఎంపీడీవో కుసుమ కుమారి కోరారు. గురువారం పెదఅంబడిపూడి, గుంటుపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్ ఫిర్యాదుల రిజిష్టర్‌లు తనిఖీతో పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు, సర్వేలు సకాలంలో పూర్తి చెయ్యాలని విధుల్లో అలసత్వం వీడి వేళాపాళా పాటించాలని ఎంపీడీవో ఆదేశించారు.

మువ్వల వెంకటరమణారావుకు సత్కారం

చీరాల అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకులు మువ్వల వెంకటరమణరావుకు గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో సత్కరించారు.కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, పట్టణ అధ్యక్షురాలు జి.భవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: వ్యవసాయం తర్వాత అధికంగా ఆధారపడి జీవిస్తున్న పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని పశువైద్యులు జి.పావని సూచించారు. గురువారం మండలంలోని దేవినూతల గ్రామపంచాయితీలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 25 గేదెలకు చికిత్సలు, 19 గొర్రెలకు వ్యాధి నివారణ మందుల ఉచితంగా అందించారు.

బై..బై.. వినాయకా!



పేరాల అన్నదాతవారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు

చీరాల అర్బన్: వినాయక చవితి చలువ పందిళ్లల్లో కొలువు దీరిన గణనాథులు తొమ్మిదిరోజులు పాటు ప్రత్యేక పూజలందుకుని తల్లి గంగ ఒడిలోకి చేరుతున్నారు. నవరాత్రులు ప్రత్యేక పూజలు, భజనలు, వివిధ రకాల ఫలహారాలు అందుకున్న విఘ్నేశ్వరుడుకు నీరాజనాలు పలుకుతు వీడ్కోలు పలుకుతున్నారు. గురువారం వాడరేవు సముద్ర తీరంలో నిమజ్జనం చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాగ్రత్తలు పాటిస్తే విష జ్వరాలు దూరం

ఉప్పుటూరు(చినగంజాం): ప్రజలు విషజ్వరాలు సోకకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య రక్షణ పొందవచ్చు అని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హోమియో మందులు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

వైరల్ ఫీవర్లతో అప్రమత్తంగా ఉండాలి

కుంకలమర్రు (కారంచేడు): గ్రామాల్లో వైరల్ ఫీవర్లు నమోదు కాకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐఓ) డాక్టర్ రత్నమన్మోహన్ అన్నారు. గురువారం మండలంలోని కుంకలమర్రులో నిర్వహించిన వైద్య శిబిరం తనిఖీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై వారిలో చైతన్యం కల్పించాలన్నారు. డాక్టర్ పృథ్వీరాజ్, ఎంఎల్‌హెచ్‌పీలు వసుధ, కరీమా, సుజన, సుజాత పాల్గొన్నారు.

లింగ వివక్ష అమానుషం



లింగ సున్నితత్వంపై మాట్లాడుతున్న సీడీపీఓ

బల్లికురవ: సమాజంలో బాలికల పట్ల చిన్నచూపు చూస్తున్నారని బాలురైనా, బాలికలైనా ఒక్కటేనని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో డి. సుధ అన్నారు. గురువారం కొప్పరపాలెం సచివాలయంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా లింగ సున్నితత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు ఆర్థిక సమాజిక సాధికారతకు లింగ సమానత్వం ఎంతో ముఖ్యమన్నారు. ఉప సర్పంచ్ గొర్రెపాటి ఆనెమ్మ, మాజీ ఎంపీటీసీ ప్రత్తిపాటి అబ్బులు, మాగులూరి శివారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోటినాగులు, సతీష్, సూపర్‌వైజర్ మీరాబి మాట్లాడారు.



కోనంకి సైన్స్ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



చినగంజాంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



యద్దనపూడి: గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు



కొడవలివారిపాలెంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా గురు పూజోత్సవం

వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుర్కరించు కొని విద్యార్థులు గురుపూజోత్సవం గురువారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పాటల పోటీలు, నృత్యాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

అద్దంకి రూరల్: పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పుట్టంరాజు కళాక్షేత్రంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ పురస్కార గ్రహీతలకు వెయ్యి రూపాయల నగదు, నూతన వస్త్రాలు, ప్రశంస పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు ఇమ్మడి శెట్టి అనిత, నారాయణం శ్రీనివాసాచార్యులు, కేవీ పోలిరెడ్డి, పాడపాటి కృష్ణారావు, కోట రామలక్ష్మమ్మ పురస్కారాన్ని అందుకున్నారు. ఎస్‌టీఓ షేక్ అబ్దుల్ ఖాదర్, రావుల బాపయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: బొమ్మనంపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సీహెచ్‌వీ శ్రీనివాస మూర్తి, జ్యోతి, శ్రీమన్నారాయణమూర్తి, హిందీ ఉపాధ్యాయుడు పొత్తూరి వెంకట్రావును శాలువాలతో సత్కరించారు. వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు షేక్ అజ్రత్ అలీ, దామా నాగేశ్వరరావు, కేఎస్‌జే శ్రీనివాస్, చాగంటి సుబ్బారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు, పూర్వ ఎన్‌సీసీ అధికారి ఎస్. నరసింహారావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయిని ఉదయభానేశ్వరిని సత్కరించారు.

పర్చూరు(చినగంజాం): ఎస్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బెంజిమన్ సర్వేపరి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొడవలివారిపాలెం (కారంచేడు): కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏ ఉమామహేశ్వరరావు పోటీలను నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులుగా ఉన్న సీహెచ్ తిమోతీ, వైసీహెచ్ కోటయ్యలను సత్కరించారు.

మార్టూరు: కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయురాలు మేరీ జాక్వెలినను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు చందలూరు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యద్దనపూడి: జాగర్లమూడి గ్రామంలోని ఏఎస్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ కొల్లా విజయకుమర్ అధ్యక్షతన గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ -1 పుల్లేల సుబ్రహ్మణ్యేశ్వరావు, ఎంఈఓ-2 చిలుకూరి గోపి హాజరయ్యారు. రోటరీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. కార్యదర్శి కోమటి అంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.



అద్దంకి: పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు



అద్దంకి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



చెరుకూరు పాఠశాలలో గురుపూజోత్సవం



వేటపాలెం: : విద్యార్థులు సన్మానించిన ఉపాధ్యాయులు